క్లుప్తంగా

నేడు జ్యోతుల మహోత్సవం



ముస్తాబైన చౌడేశ్వరీదేవి ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జ్యోతుల మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయం ముస్తాబైంది. ఆయా కాలనీలకు చెందిన భక్తులు శనివారం అర్ధరాత్రి జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయనున్నారు. జ్యోతుల సందర్భంగా గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



ఆకుమల్ల సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

సంజామల: ఆకుమల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా ఉప్పలూరు మోహన్ రెడ్డి, డైరెక్టర్లుగా నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని నూతన చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీఎల్‌సీఓ ప్రభాకర్ రావు, పీఏసీఎస్ సీఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మోనూ ప్రకారం భోజనం పెట్టాలి



అక్కంపల్లె పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ

సంజామల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మోనూ ప్రకారం అందించాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) రమణారెడ్డి సూచించారు. శనివారం నొస్సం, అక్కంపల్లె గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా భోజనం సరైన మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ భాషా ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. శనివార పట్టణంలోని బనగానపల్లె చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు కొనసాగించవద్దన్నారు. ఆటోల్లో ప్రయాణించే మహిళలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, చిన్నపిల్లలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర రికార్డులు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

దోమల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

గోస్పాడు: దోమలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వాటి నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం పట్టణంలోని సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్ సమావేశ భవనంలో జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాపింపజేస్తాయన్నారు. దోమల ద్వారా వ్యాధులు ప్రబలకుండా వైద్యులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కాంతరావునాయక్ పాల్గొన్నారు.






కోవెలకుంట్ల: సొదరదిన్నె రైతు సేవా కేంద్రంలో అధికారులను నిలదీస్తున్న రైతులు, కొలిమిగుండ్ల: తోళ్లమడుగులో బందోబస్తు మధ్య పంపిణీ, కోవెలకుంట్ల: స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు, బనగానపల్లె :తమ్మడపల్లిలో యూరియా కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న అన్నదాతలు

యూరియా కష్టాలు

- ఉదయం నుంచి యూరియా కోసం ఆర్‌ఎస్‌కేల వద్ద పడిగాపులు
- పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ
- ఒక్కో రైతుకు 2 బస్తాలే
- అరకొరగా పంపిణీపై అన్నదాతల అసహనం
- అధికారపార్టీ నేతల సిఫారసుకు పెద్దపీట

బనగానపల్లె: యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాంటిదేం లేదని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా దక్కుతుందన్న గ్యారెంటీ లేదు. బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె మండలాల్లోని వివిధ రైతుసేవా కేంద్రాల్లో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. బనగానపల్లెలో అందరికీ దక్కకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నందివర్గం-532, నందవరం-532, చెరువుపల్లె-532, తిమ్మాపురం-532, ఇల్లూరుకొత్తపేట-1064, తమ్మడపల్లి, బనగానపల్లెకు-360 సహా మొత్తం 4,084 బస్తాల యూరియా పంపిణీ చేశారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు రెండు బస్తాలు, అంతకుమించి ఉన్నవారికి మూడు బస్తాలు ఇచ్చారు. పెద్దఎత్తున రైతులు ఐదు ఎకరాల లోపు ఉన్నవారే కావడంతో ఎక్కువమందికి రెండే బస్తాలు దక్కాయి.



అవుకు: రైతు సేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

30-40 ఎకరాలు ఉన్న రైతులు కూడా మూడు బస్తాలకే పరిమితం కావడం ఆవేదనకు దారితీసింది. ప్రభుత్వం వెంటనే అదనపు యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కోసం పడిగాపులు

అవుకు(కొలిమిగుండ్ల): యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు అదిగో వస్తుంది..ఇదిగో వస్తుందని చెప్పడంతో పనులు మానుకుని శనివారం తెల్లవారుజాము నుంచే రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాతలు ఎదురు చూశారు. అవుకులో మధ్యాహ్నం 12 గంటలకు లారీ వస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పడంతో కొంత మంది ఇళ్లకు వెళ్లారు. యూరియా తమ దాకా వస్తుందో రాదో అని రైతులు తిరిగి రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఒంటి గంటకు ఒక లారీ రావడంతో రైతులు సంతోషపడ్డారు. ఒక్కసారిగా రైతు సేవా కేంద్రం వద్ద గుమిగూడారు. 4 గంటలు అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి తిండి తిప్పలు లేకుండా పడిగాపులు కాసినా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో లారీ వచ్చాక యూరియా పంపిణీ చేస్తామని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. టోకెన్‌లు ఇస్తే సోమవారం తీసుకుంటామని రైతులు పట్టుపట్టారు. చివరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో చర్చించి శాంతింపజేశారు. ఎట్టకేలకు టోకెన్‌లు ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. రైతుకు ఒకటి నుంచి రెండు బస్తాలు మాత్రమే యూరియా ఇచ్చేందుకు టోకెన్‌లు ఇచ్చారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదని రైతులు మండిపడ్డారు. ప్రభుత్వం సకాలంలో యూరియా ఇచ్చి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అసహనం వ్యక్తం చేశారు.

బందోబస్తు మధ్య పంపిణీ

కొలిమిగుండ్ల: మండలంలో పోలీసుల బందోబస్తు మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు. తోళ్లమడుగు, బి.ఉప్పలూరు, తిమ్మనాయినపేట, నందిపాడు, పెట్నికోట రైతు సేవా కేంద్రాలకు మధ్యాహ్నం యూరియా లారీలు చేరుకున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి రైతులకు యూరియా బస్తాలు అందించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ తోళ్లమడుగు రైతు సేవా కేంద్రంలో పంపిణీని పరిశీలించారు. పెట్నికోట, నందిపాడులో పంపిణీ చేయకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున మాత్రమే ఇవ్వడంతో ఎలా సరిపోతాయని రైతులు వాపోయారు. వరి సాగుకు యూరియా చాలా అవసరమని తక్కువ ఇస్తే ఎలా అని రైతులు ప్రశ్నించారు. కొద్ది రోజుల్లో పంపిణీ చేస్తామని అధికారులు సర్దిచెప్పారు.

అరకొర యూరియా పంపిణీపై నిలదీత

కోవెలకుంట్ల: అవసరమైన మేర యూరియా ఇస్తారనుకుంటే అరకొరగా ఇవ్వడంపై రైతులు అధికారులను నిలదీశారు. శనివారం కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, బిజనవేముల, గుళ్లదూర్తి, సొదరదిన్నె, కోవెలకుంట్ల రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేశారు. ఉదయం నుంచే రైతులు కేంద్రాల వద్ద వేచిచూశారు. మధ్యాహ్నం నంద్యాల నుంచి స్టాక్ చేరడంతో గంటలతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. రైతు సేవా కేంద్రాలకు సరఫరా అయిన స్టాక్‌ను తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. ఒక్కో రైతుకు కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ఏమాత్రం సరిపోవడని రైతులు అధికారుల ఎదుట వాపోయారు. త్వరలో యూరియా మళ్లీ వస్తుందని, అప్పుడిస్తామని అధికారులు ఉచిత సలహా ఇవ్వడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతల సిఫారసుతో కొందరికి మాత్రం 10-20 బస్తాలు ఇచ్చారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నడుమ పంపిణీ చేయడంగమనార్హం.

పర్యవేక్షణ లోపం.. పిల్లలకు శాపం

బనగానపల్లె: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుకు నాలుగు నెలలుగా రెగ్యులర్ అధికారి లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. ఈ ప్రాజెక్టు పరిధిలో బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాలు ఉన్నాయి. మొత్తం 284 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1571 మంది బాలింతలు, 1792 మంది గర్భిణులు, 1572 మంది శిశువులు, 9185 మంది చిన్నారులు (6 నెలల నుంచి 3 ఏళ్లు), 4382 మంది పిల్లలు (3 నుంచి 6ఏళ్లు) ఉన్నారు. ప్రభుత్వం అమలు చేసే మెనూను వీరందరికీ ప్రతిరోజు అందించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలి. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఐసీడీఎస్ అధికారుల బాధ్యత. అయితే ఇక్కడికి సుదూరమైన ఆత్మకూరు గ్రేడ్-1 సూపర్‌వైజర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో పరిస్థితి మరింత క్లిష్టమైంది. ఆ అధికారి అనారోగ్యంతో కొంత



బనగానపల్లె ఐసీడీఎస్ కార్యాలయం

కాలం సెలవులో ఉండడంతో పాటు తిరిగి బాధ్యతలు చేపట్టినా విధులకు సక్రమంగా హాజరు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ, పర్యవేక్షణ లోపించిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రెగ్యులర్ సీడీపీఓను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లకు చెందిన జడలమ్మగారి వెంకటేష్‌పై దాడి చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు శనివారం తెలిపారు. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో బోయ రవికుమార్, అంది శ్రీనివాసకుమార్ పాత కక్షలు మనసులో పెట్టుకుని వెంకటేష్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా అడ్డగించి దాడి చేశారు. బాధితుడి సోదరుడు జడలమ్మ గారి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

గిరిజన సమాఖ్య కార్యదర్శిగా రాముడు



మోటా రాముడు

డోన్ టౌన్: ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డోన్‌కు చెందిన మోటా రాముడు ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిపై డోన్‌కు చెందిన సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

మొద్దు నిద్రలో చంద్రబాబు ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు

బనగానపల్లె : రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకుండా మొద్దు నిద్రపోతోందని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అత్తార్ జావీద్, యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతులు ఎరువుల కోసం క్యూలో నిలుస్తుంటే, మంత్రి అచ్చెమనాయుడు వారిని భోజనానికి క్యూలో నిలిచిన వాళ్లతో పోల్చడం అవమానకరమని, అలాంటి వ్యక్తి మంత్రి పదవిలో కొనసాగడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువులను ప్రైవేట్ డీలర్లకు మళ్లించడంతోనే ఈ సమస్య తలెత్తిందని, వారు యూరియా బస్తాలను బ్లాక్ చేసి రూ.270 బస్తాను రూ.450-600కి అమ్ముతున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు మార్కెట్ ధర కంటే రూ.50 తక్కువ ధరకే



అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యూరియా అందించామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో బస్తా యూరియాకు రోజుల తరబడి క్యూలో నిలవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు మరింత కష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు అన్నదాత సుఖీభవ పేరిట ఇస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. అందుకే ఈ నెల 9న డోన్ ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ‘అన్నదాత పోరు’ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలని వినతి



సీహెచ్‌సీ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో దోమలు అధికమై ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని..ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజా ఐక్య సంఘాల వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్‌నాయుడుకు వినతిపత్రాలు అందజేశారు. ఐక్యవేదిక నాయకులు సుధాకర్, కరీంబాషా, ఓబులేసు మాట్లాడుతూ.. పట్టణంలోని సంతపేట, గాంధీనగర్, ఎల్‌ఎం కాంపౌండ్, పట్టణ శివారులోని స్వామినగర్, ఇందిరమ్మ కాలనీల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, తదితర వైరల్ జ్వరాలు ప్రబలడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఆయా కాలనీల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలందించాలని కోరారు.

వాహనదారులకు రికార్డులు తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

బేతంచెర్ల: డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ తదితర రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తిరుపాలు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఆయా కూడళ్లలో వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని, అధిక లోడుతో వెళ్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజ మార్గదర్శకుడు ఉపాధ్యాయుడే

ప్యాపిలి: సమాజానికి ఉపాధ్యాయుడే మార్గదర్శకుడని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దగల శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ప్రతిభా పాటవాలు గల విద్యార్థులు ఉన్నారని, అలాంటి వారిలోని ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఎంఈఓలు మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్ నాయక్‌తో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎస్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ నాయకులు తెలుగు విజయ్‌కుమార్, సునీల్, మధు, దాదా, రఫి, యూటీఎఫ్ నాయకులు అబ్దుల్ లతీఫ్, ఎస్టీయూ నేత వెంకట్ నాయక్, ఏపీటీఎఫ్ నాయకుడు సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయండి

ప్యాపిలి: సుదూర ప్రాంతాల నుంచి సరుకు తీసుకొచ్చిన రైతుల నుంచి గిట్టుబాటు ధరతోనే టమాటను కొనుగోలు చేయాలని ప్యాపిలి ఎస్‌ఐ మధుసూదన ఆదేశించారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన ‘టమాట ధర ఢమాల్’ కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు టమాట మార్కెట్‌లో రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. 10 బాక్స్‌లకు గాను 8 బాక్స్‌లకే వ్యాపారులు డబ్బులు చెల్లిస్తున్నారని, అలాగే రూ. 100కు పది రూపాల చొప్పున తగ్గించి ఇస్తున్నారని రైతులు ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో వ్యాపారుల తీరుపై ఎస్‌ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు సరుకు తీసుకొచ్చే రైతుల వ్యయప్రయాసలను వ్యాపారులు గుర్తించాలన్నారు. టమాటను కొనుగోలు చేయకుండా వెనక్కు పంపడం, తక్కువ ధరకు తీసుకోవడం మంచిది కాదన్నారు. మార్కెట్‌కు వచ్చిన సరుకును గిట్టుబాటు ధరతోనే కొనుగోలు చేయాలన్నారు. అందుకు స్పందించిన వ్యాపారులు మార్కెట్‌లకు సెలవులు ఉన్నందునే ఈ పరిస్థితి తలెత్తిందని..ఇకపై మదనపల్లె మార్కెట్ ధరకు దీటుగానే సరుకు కొనుగోలు చేస్తామన్నారు.



టమాట వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

బాధిత రైతును ఆదుకోవాలి

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో గడ్డివామి దగ్ధమై నష్టపోయిన రైతు రామ చంద్రుడును ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు తిరుమలేష్, నాగేశ్వరరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. బాధిత రైతుకు చెందిన 3 గడ్డివాములు శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. శనివారం సీపీఐ నాయకులు గ్రామాన్ని సందర్శించారు. రైతుకు రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని.. నష్టపరిహారం అందజేయాలని కోరారు.

రోడ్డు పక్కన ప్రమాదం

కొలిమిగుండ్ల: బెలుం-కొలిమిగుండ్ల ప్రధాన రహదారి పక్కన చాలా చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. భారీ వాహనాలు తరచూ అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. అనంతపురం-అమరావతి జాతీయ రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పలు చోట్ల రోడ్డు కంటే తక్కువగా ఉండడంతో రెండు వాహనాలు ఎదురుపడిన సమయంలో కిందకు దిగలేని పరిస్థితి ఏర్పడుతోందని వాహన చోదకులు పేర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. నాపరాళ్లను తరలించే ట్రాక్టర్లు, సిమెంట్ ట్యాంకర్లు కింద పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రాత్రి వేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో లైటింగ్ కనిపించకపోవడంతో రోడ్డు పక్కకు దిగే తరుణంలో కింద పడుతున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పక్కన గుంతలు లేకుండా చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఏర్పడిన గుంత



ఉడుములపాడు వద్ద రోడ్డుపై ఉన్న గుంతలు

గుంతల దారులతో అవస్థలు

డోన్ టౌన్: జాతీయ రహదారిపై తిరిగే వాహనాల నుంచి టోల్ చార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారే తప్ప సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. కొద్ది నెలలుగా మండల పరిధిలోని జాతీయ రహదారి గుంతల మయంగా మారిందని ఆరోపిస్తున్నారు. జగదుర్తి, ఉడుములపాడు, డోన్ బైపాస్, యు.కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, ఎనుగుమర్రి, ప్యాపిలి, పోతుదొడ్డి తదితర గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపై గుంతలు అధికంగా ఉన్నాయి. ఇటీవల వర్షాల కారణంగా ఇవి మరింత ఎక్కువ అయ్యాయి. దీని కారణంగా కార్లు, చిన్న వాహనాలు ప్రమాదాలకు గురవుతుండడంతో పాటు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బాలికలు ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి

బేతంచెర్ల: బాలికలు చదువుతోపాటు ఆపద సమయంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాల చంద్ర సూచించారు. శనివారం పట్టణంలోని ధరణి టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని, భద్రత కోసం అవసరమైన సామాగ్రి ఉపయోగించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా, శక్తివంతంగా స్పందించాల్సిన అవసరాన్ని వివరించారు. అపరిచితులతో పాటించాల్సిన విధానం గురించి తెలియజేశారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 100 లేదా 1098 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలచంద్ర